మీకో నాలుగు పదుల వయసు ఉంటుందా? అయితే మీ చిన్నప్పటి సంగతులు ఓసారి గుర్తుకు తెచ్చుకోండి, ఏం గుర్తుకొచ్చాయి?.. ఉమ్మడి కుటుంబం, పెద్దలంటే గౌరవం, ఒత్తిడి లేని చదువులు, బడిలో ఆటలు పాటలు, వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి ప్రయాణం, నాన్న భుజాల పైనుంచి కళ్లు పెద్దవి చేసుకొని చూసిన జాతర, వర్షపు నీటిలో కాగితపు పడవలు.. ఇవే కదా.. అవి కేవలం జ్ఞాపకాలే కాదు, మీ వ్యక్తిత్వ పునాదులు. విలువల పాఠాలు. బాల్య అనుభవాలు, జ్ఞాపకాలే మీరు.

ఆ మధ్య వచ్చిన పిల్ల జమిందార్ సినిమాలో హీరో నాని 'చదువు ఎవరైనా చెప్తారు సార్.. సంస్కారం గురించి మీరే చెప్పాలి' అంటాడు. అక్షరాలు బడిలో నేర్పుతారేమో గానీ, అనుబంధాలను కుటుంబమే నేర్పుతుంది. పిల్లలకు తొలి బడి ఇల్లే. సుద్దులు, బుద్ధులు చెప్పేది కుటుంబమే. అప్పట్లో తాతయ్య నానమ్మ, అమ్మానాన్న, బాబాయి పిన్ని, అత్తయ్య మామయ్య కలిసి ఉండేదే కుటుంబం. వీళ్లందరూ టీచర్లే. ప్రత్యేకంగా సిలబస్ అంటూ ఏమీ ఉండదు. ఒక్కొక్కరూ ఒక్కో సబ్జెక్ట్. ఉమ్మడి కుటుంబంలో పెరిగిన పిల్లలకు చాలా ప్రయోజనాలు ఉంటాయి. అవి ఏంటో చూద్దాం..

- ఉమ్మడి కుటుంబాల్లోని పిల్లలకు ఏ చిన్న కష్టం వచ్చినా నేనున్నానంటూ కుటుంబంలోని పెద్దలు ఎవరో ఒకరు వస్తారు. సంతోషం, దుఃఖం ఎవరితో ఒకరితో పంచుకునే అవకాశం ఉంటుంది. నాకు అందరూ ఉన్నారనే భావన బలంగా ఉంటుంది. ఇది పిల్లలకు కొండంత భరోసా ఇస్తుంది. వాళ్లలో భద్రతా భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.
- ఉమ్మడి కుటుంబంలో రెండు, మూడు తరాల వాళ్లు ఉంటారు. పిల్లలు ఈ తరాల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. క్రిటికల్ థింకింగ్ కోసమో, మేనేజ్‌మెంట్ స్కిల్స్ కోసమో ఏ హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌కి వెళ్లాల్సిన అవసరం లేదు. ఉమ్మడి కుటుంబంలో పెరిగితే ఆటోమేటిక్‌గా అన్నీ వచ్చేస్తాయి.
- నలుగురిలో ఎలా ఉండాలి, ఎలా మాట్లాడాలి నేర్పేది ఉమ్మడి కుటుంబమే. ఏ కార్పొరేట్ ఆఫీసులో ట్రైనింగ్ అవసరం లేకుండానే టీం మేనేజ్‌మెంట్ నేర్చుకోవచ్చు. బంధాలు ఎంత విలువైనవి, వాటిని ఎలా నిలుపుకోవాలి అనే విషయాలు తెలుసుకునేదీ ఇక్కడే.
- కుటుంబం అంటే నలుగురో, పదిమందో ఒక గూడు కింద ఉండటం కాదు. సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే పాఠశాల. వీటిని ఎవ్వరూ ఓ సిలబస్ మాదిరిగా చెప్పరు. ఆచార వ్యవహారాల్లోనూ, పండుగల సందర్భాల్లోనూ పెద్దలు ఏం చేస్తున్నారో చూసి పిల్లలు నేర్చుకుంటారు.
- ఉమ్మడి కుటుంబాల్లో నీది నాది అనే ధోరణి ఉండదు. అంతా మనదే అనే భావన మాత్రమే ఉంటుంది. నీ పని ఇది, నా పని ఇది అంటూ చర్చలు, సమావేశాలు ఏమీ ఉండవు. ఎవరి పని వారు చేసుకుపోతూ ఉంటారు అంతే. టీం వర్క్ అంటే ఎలా ఉంటుందో పిల్లలకి ఆటోమేటిక్‌గా తెలిసిపోతుంది.





## వసుధైక కుటుంబం..

జనరేషన్ ఆల్ఫా, బీటాలకు ప్రపంచమే ఇల్లు. భౌగోళిక, మానసిక సరిహద్దులను దాటి వసుధైక కుటుంబంలా ఉండనున్నారు. సాంస్కృతిక వ్యత్యాసాల పట్ల సానుకూల దృక్పథం, భిన్నాభిప్రాయాల పట్ల గౌరవం, సామాజిక అంశాల పట్ల అవగాహన ఈ తరాల ప్రధాన లక్షణాలు కానున్నాయి. జీవనశైలి కూడా పర్యావరణానికి హాని కలిగించని విధంగా మారనుంది. ముందు తరాల వారికి మానసిక ఆరోగ్యంపై అవగాహన లేక రకరకాల సమస్యలతో సతమతమైతే, ఈ తరాలు మానసిక ఆరోగ్యానికి మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నాయి. ఈ తరాలతో వచ్చిన చిక్కల్లా ఏంటంటే.. ఆప్యాయత అనురాగాలకు, బంధాలకు బంధుత్వాలకు నిర్వచనం మారిపోవడం. ఈ విషయంలో సరైన దిశానిర్దేశం చేయగలిగితే నవతరం బాల్యమూ నందనవనంగా మారుతుంది.

### కథ చెబుతాను.. ఊ కొడతావా..

అప్పట్లో పిల్లలకు నిద్రపోయే ముందు అమ్మమ్మో తాతయ్యో, అమ్మో, పిన్నో కథలు చెప్పేవారు. రామాయణ మహాభారతాల దగ్గర నుంచి పంచతంత్ర కథల వరకు పిల్లలు వింటూ పడుకునే వాళ్లు. ఇప్పుడు ఆ సంస్కృతే లేకుండా పోయింది. అందుకే పిల్లల్లో సృజనాత్మకత గానీ, కుతూహలంగానీ తగ్గుతూ వస్తున్నాయి. కథలు వినడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి పెరుగుతుంది. రెక్కల గుర్రంపై రాజకుమారుడు, ఒంటి కన్ను రాక్షసుడు గురించి కథల్లో తెలుసుకున్నప్పుడు ఆ రూపాన్ని పిల్లలు ఊహిస్తారు. మానవ మెదడు సెకండ్‌కి 75 చిత్రాలను ఊహించగలదు. కథలోని పాత్రలను, ఘటనలను ఊహించడం ద్వారా పిల్లల మెదడు ఊహాశక్తి మరింత మెరుగవుతుంది. కథలు వినడం ద్వారా పిల్లలకు భాషపై పట్టు వస్తుంది. భావోద్వేగాలు ఎలా